క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం డి.ములగ గ్రామానికి చెందిన భూపతి కృష్ణ మూర్తి మనవుడు లోచన ఇటీవల అనారోగ్య కారణంగా వైద్యం చేయించుకొని ఆర్థికంగా చితికిపోయిన కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు ఎమ్మెల్యే జోగారావు సీఎం సహాయనిధికి సిఫార్సు చేశారు. ఇటీవల వారి కుటుంబానికి మంజూరైన రూ.1.80 వేల విలువ గల ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును వారి కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కష్టంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తు పెట్టుకొని అండగా నిలవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు మడక విశ్వనాథం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిలటరీ పోలీస్‌కు మహిళ ఎంపిక



స్వప్నరాణి

బలిజిపేట: విశాఖ ఏఆర్‌ఓ పరిధిలో ఇటీవల నిర్వహించిన మహిళ మిలటరీ పోలీసుకు చిలకలపల్లికి చెందిన ఉరిటి స్వప్నరాణి ఎంపికయ్యారు. తండ్రి తిరుపతిరావు 108 వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నారు. స్వప్నరాణిని గ్రామస్తులు అభినందించారు.

ఎంఈఓగా సామల



ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండల విద్యాశాఖాధికారి-1(ఎఫ్ఏసీ)గా సామల సింహాచలం శనివారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని విద్యాపరంగా అన్ని విషయాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు సంఘ నాయకులందరూ కృషి చేయాలన్నారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా డీపీటీఓ టీవీఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం క్షతగాత్రులు రక్తం సమయానికి అందక మృతి చెందుతున్నారని ఆయన అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలన్నారు. వాహనాలను నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కనకదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మిడి కొండ శివరాత్రి జాతరకు ఏర్పాట్లు



గుమ్మడికొండపై వెలసిన శివయ్య

సాలూరు రూరల్: సాలూరు మండలం కావుడివలస వద్ద గుమ్మడికొండ గృహల్లో ఉన్న శివాలయంలో శివరాత్రి జాతర ఏర్పాట్లు నిర్వహణ కమిటీ చేస్తుందని కమిటీ ప్రతినిధి బంగార్రాజు తెలిపారు. శివాలయంలో ఉన్న శివలింగాన్ని పూజించేందుకు శివరాత్రి రోజున వేలాది మంది భక్తులు వస్తుంటారని తెలిపారు. ఈ ఏడాది కొండపైకి ఎక్కేందుకు నిర్వహణ కమిటీ మెట్లును నిర్మించామని భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను తహసీల్దార్ వరహాలు శనివారం పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి కేంద్రాలను పరిశీలించి, కావాల్సిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు కోసం గదులను పరిశీలించారు.

పల్లెకు పోదాం.. ప్రగతిని చూద్దాం...

పార్వతీపురం టౌన్:

పల్లెల ప్రగతికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టం కడుతోంది. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతుంది. జిల్లా కేంద్రానికి 3.8 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీనారాయణపురం గ్రామం గతంలో తెలుగుదేశం పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోలేదు. 2021 సర్పంచ్ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇద్దామని గ్రామస్తులు తీర్మానించుకున్నారు. గ్రామస్తులంతా సమావేశమై డిగ్రీ పూర్తి చేసిన జక్కు ప్రవీణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామాన్ని అతి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి టీడీపీకి, పచ్చమీడియాకు కనబడడం లేదా 'ఇది కదా అభివృద్ధి' అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.





నూతన గ్రామ సచివాలయం



చెరువుకు రిటర్నింగ్‌వాల్ నాడు - నేడు



గ్రామంలో కొత్తగా వేసిన రోడ్డు

వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ.42 లక్షల వ్యయంతో సచివాలయ భవన నిర్మాణం పూర్తి.
- గ్రామ ప్రధాన రహదారి గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పూర్తిగా దెబ్బతినడంతో రూ.36 లక్షల వ్యయంతో కొత్త బీటీ రోడ్డు వేశారు.
- గ్రామంలో ప్రతీ ఒక్కరికి శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో రూ.50లక్షల అంచనా వ్యయంతో 75శాతం పనులు పూర్తి చేశారు.
- గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో విలేజ్ పార్కు ఏర్పాటు.
- తామర చెరువుకి రూ.6లక్షల వ్యయంతో రిటర్నింగ్ వాల్ నిర్మించి రక్షణ కవచం ఏర్పాటు చేశారు.
- గ్రామంలో వాహనాల రద్దీని తగ్గించడానికి రూ.5లక్షల వ్యయంతో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- గ్రామంలో శ్మశానం దగ్గర రూ.3 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మించారు.
- రజక వీధికి రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం పూర్తి చేశారు.
- సీతమ్మ పేరంటాల వీధిలో రూ. 3లక్షల వ్యయంతో రోడ్డు, కాలువల నిర్మాణం పూర్తి.
- గ్రామంలో రైతులకు అవసరమైన విధంగా సుమారు రూ.20లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు.
- గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో మూడు రచ్చబండలు నిర్మాణం పూర్తి చేశారు.
- మంచినీటి బావికి వెళ్లేందుకు రూ. 5లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం చేపట్టారు.
- గ్రామంలో నీటి కొరత లేకుండా రూ.7 లక్షల వ్యయంతో 8 బోర్లను తీయించి మంచినీటిని సరఫరా చేస్తున్నారు.
- గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా రూ.2 లక్షల వ్యయంతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు.


గ్రామం వివరాలు

గ్రామ జనాభా	: 2500మంది
రేషన్‌కార్డులు	: 558
పింఛన్ లబ్ధిదారులు	: 330
రైతు భరోసా లబ్ధిదారులు	: 380
అమ్మ ఒడి లబ్ధిదారు	: 160
చేయూత లబ్ధిదారులు	: 137

మరింత అభివృద్ధిలోకి తీసుకువెళ్తా..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి నన్ను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన గ్రామాభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరచి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తున్నాం. గ్రామంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. – జక్కు ప్రవీణ్‌కుమార్, సర్పంచ్, లక్ష్మీనారాయణపురం



లక్ష్మీనారాయణపురం గ్రామం వ్యూ



గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ



నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ పార్క్

సచివాలయాలతో పారదర్శక సేవలు

- రైతులకు అందుబాటులో ఆర్‌బీకే భవనాలు
- అభివృద్ధిని చూసి జగనన్నను దీవించండి
- ఎమ్మెల్యే జోగారావు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థతో ప్రజలకు పారదర్శక సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలో నిడగల్లులో రూ.43లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే జోగారావుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రధాన వీధిలో కూడలి వద్ద మొక్కను నాటించారు. అనంతరం సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా స్థానిక సర్పంచ్ రాయిపిల్లి ఆరుద్రమ్మ ఒక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థలో లక్షకు పైబడి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే సొంత భవనాలు నిర్మించి ప్రజలకు పారదర్శకంగా సేవలందించడం జరుగుతుందన్నారు. రైతులకు స్థానికంగానే ఎరువులు, విత్తనాలు లభ్యమయ్యే విధంగా ఆర్‌బీకే భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. 920 కుటుంబాలున్న నిడగల్లు గ్రామంలో జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.20కోట్ల 78 లక్షల 15వేల 541లు లబ్ధిదారులకు వివిధ రూపాల్లో అందజేసినట్టు తెలిపారు. నాడు నేడు పథకం నిధులు రూ కోటీ 36 లక్షలతో పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేసినట్టు తెలిపారు. జీజీఎంపీ రూ.20 లక్షలు, సచివాలయ భవనాలు రోడ్లు కాలువలు, ఇతర పనులుతో కలిసి మొత్తం పనులు రూ.31కోట్ల, 31 లక్షల, 85వేల 624లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇంతటి అభివృద్ధి చేయడానికి కృషి చేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, మండల పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సేవలందిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆశీర్వదించాలని కోరారు. వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఉప సర్పంచ్ సింహాచలం, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఈశ్వరనారాయణ, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, మాజీ సర్పంచ్ మరియదాసు, పి.తిరుపతినాయుడు, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి పెంట తిరుపతిరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్:

మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యకు మూడు రోజుల్లో పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండల ప్రజాప్రతినిధులతో డి.శిర్లాం సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీం ప్రాజెక్టును శనివారం క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండల పరిధిలో గల సుమారు 64 గ్రామాలకు డి.శిర్లాం సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీం ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ ప్రాజెక్టు గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.33 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఇటీవల స్కీంలో ఏర్పడిన అనుకోని సమస్య మూలంగా గత సోమవారం నుంచి ఈ వాటర్ స్కీం పరిధిలో ఉన్న గ్రామాలకు తాగునీరు సరఫరా ఆగిపోయిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెనువెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను గుర్తించి వాటర్ పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

త్వరితగతిన సమస్యకు పరిష్కారం

డి.శిర్లాం సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీం బావి లోపల లీక్ కావడం చేత ఇసుకు లోపలకు చేరి ఐదు అడుగుల మేర ఇసుక మేట వేయడం వల్ల రెండు ప్రధాన పంపింగ్ పైపులకు అడ్డంగా ఇసుక పేరుకుపోయి మోటారులతో మంచినీరు తోడే పరిస్థితి లేని విషయాన్ని శ్రీకాకుళం నుంచి రప్పించిన ప్రత్యేక నిపుణులు గుర్తించారన్నారు. ఇసుకను నీటిలో నుంచి తీయించి ప్రధాన పంపులకు అడ్డంకి లేకుండా చేయడానికి మరో మూడు రోజుల సమయం పడుతుందన్న విషయం అధికారులు చెప్పారన్నారు. ఏది ఏమైనా వచ్చే మంగళవారానికి మంచి నీటి సరఫరా పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. ఈ వాస్తవ పరిస్థితిని ప్రజలు గుర్తించి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈ, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ గురురాజు, ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సిద్ధ జగన్నాథరావు, బి.రవికుమార్, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు



నులి పురుగులు నివారణ మాత్రలు వేయిస్తున్న ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి

సీతానగరం: మండలంలోని జాతీయ నులి పురుగులు నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి, వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్, డాక్టర్ పావని పర్యవేక్షణలో వైద్య సిబ్బంది నులి పురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ మేరకు గాదెలవలసలో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూలు పిల్లలకు ఎంఎల్‌హెచ్‌పీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నులి పురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సీతానగరం పీహెచ్‌సీ పరిధిలోని బగ్గందొరవలస పాఠశాలలో వైద్య సిబ్బంది పలు గ్రామాల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మాత్రలు వేయించుకోని వారికి శనివారం నులి పురుగులు నివారణ మాత్రలు వేయడం జరిగిందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, ఐసీడీఎస్ ఎస్‌ఓ పూర్ణిమ, ఎంపీహెచ్‌ఈఓలు, సూపరువైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో వ్యాధుల మాయం



నీలకంఠాపురంలో బాలింతలతో మాట్లాడుతున్న డీఎంఓ జగన్మోహనరావు

సీతానగరం: ప్రభుత్వం సమకూర్చిన వ్యాధి నిరోధక టీకాలు పిల్లలకు వచ్చే వ్యాధులను మటుమాయం చేయడానికి దోహద పడతాయని జిల్లా మలేరియా నివారణ(డీఎంఓ) అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం, గుచ్చిమి గ్రామాల్లో టీకా కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పిల్లలకు వేస్తున్న టీకా మందుల రికార్డుల్లో వివరాలను, ఎంసీపీ రికార్డులు పరిశీలించి సకాలంలో పిల్లలకు టీకాలు వేస్తున్నారా! లేదా! అని పరిశీలించారు. నీలకంఠాపురంలో పిల్లల ఆరోగ్య కార్డులను పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ టీకాలు - వాటి ఆవశ్యకతను బాలింతలకు వివరించారు. పిల్లల పట్ల తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలు, బాలింతలు ఆహారపు అలవాట్లలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ప్రాణాంతకమైన వ్యాధులు సోకకుండా ఉండేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

పార్వతీపురం టౌన్:

వాహన చోదకులు విధిగా రహదారి భద్రత నియమాలను పాటించాలని పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం వైఎస్సార్ కూడలి వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోవాలాలు వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలను క్రమం తప్పకుండా పాటించాలన్నారు. పరిమితికి మించి లోడ్ వేయరాదన్నారు. ఆటోలో ప్రయాణికులు ఉంటారని, వారిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఆటోలకు ఫిట్‌నెస్, ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ కృష్ణారావు

లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలి : సీఐ

సాలూరు:

విద్యార్థులు లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలని పట్టణ సీఐ జి.దేముడుబాబు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని భాష్యం, సాయిసూర్య పాఠశాలల వద్ద శనివారం నిర్వహించిన పదవ తరగతి ప్రజ్ఞా వికాస కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. పరీక్ష ప్రశ్నపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ, పరీక్షలంటే భయాన్ని విద్యార్థులు విడనాడాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పట్టుదలతో విద్యను అభ్యసించడం వలన జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని అన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు, మండల కమిటీ సభ్యులు పూల్, సుస్మిత, వరుణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ జి.డి.బాబు